ప్రజాశక్తి

శనివారం 10 ఫిబ్రవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సుధాకర్ చూపు టిడిపి వైపు..?

◆ విశాఖ దక్షిణ టిక్కెట్టుపై గురి ◆ ఆయన వెంట పలువురు కార్పొరేటర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ప్రస్తుతం టిడిపివైపు చూస్తున్నారు. అయితే ఆయనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తేనే ఆ పార్టీలోకి వెళ్తారన్న ప్రచారం సాగుతోంది. వైసిపిలో ప్రారంభం నుంచీ ఉన్న ఆయన ఆ పార్టీ తరపున అసెంబ్లీ టికెట్ సాధించి, విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని పదేళ్లుగా ప్రయత్నిస్తూ వచ్చారు. ఐదేళ్లుగా ఈ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఈ నియోజకవర్గం నుంచి ఇంతవరకు వైసిపి అభ్యర్థి విజయం సాధించలేదు. 2014లో కోలా గురువులు, 2019లో ద్రోణంరాజు శ్రీనివాసరావు వైసిపి అభ్యర్థులుగా పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. కోవిడ్ కారణంగా ద్రోణంరాజు శ్రీనివాసరావు మరణించడంతో ఈ నియోజక వర్గం టిడిపి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆ పార్టీకి దూరం జరిగి వైసిపి కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచీ ఈ నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యేగానే ఆయన అన్ని వ్యవహారాలూ నడుపుతున్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా ఆయనే పోటీ చేసే అవకాశం ఉంది. ఆయనకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు భోగట్టా. ఈ విషయాలన్నీ సీతంరాజు సుధాకర్‌కు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ద్రోణంరాజు శ్రీనివాసరావు మరణి



సీతంరాజు సుధాకర్

ంచడంతో,ఆయన సామాజిక తరగతికి చెందిన తనకు వైసిపి టికెట్ దక్కవచ్చని సీతంరాజు సుధాకర్ గట్టిగా ఆశించారు. ఆ దిశగానే ప్రయత్నాలు చేశారు. గత ఏడాది జరిగిన శాసనమండలి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజవర్గం స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ ఆదేశించడంతో ఇష్టం లేకపోయినా, అంగీకరించి పోటీ చేశారు. తుదకు పరాజయం చెందారు. అయినప్పటికీ విశాఖ దక్షిణ నుంచి శాసనసభకు పోటీ చేయాలనే ఆలోచనలను ఆయన విరమించలేదు. అసెంబ్లీ టికెట్ తనకి ఇవ్వాలని పార్టీపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. అదే సందర్భంలో దక్షిణ నియోజకవర్గంలో తన పలుకుబడిని పెంచుకోవడంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. అలాగే వైసిపి కార్పొరేటర్లతో సంబంధాలను కొనసాగిస్తూ వారిని దగ్గరకు చేరదీశారు. వైసిపి కార్పొరేటర్లు ప్రతిపాదించిన సేవా కార్యక్రమాలకు ఇతోధికంగా ఆర్థిక సాయం అందించారు. దీంతో అధికార వైసిపి కార్పొరేటర్లు పలువురు ఆయన వెంట నడిచారు. 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు తొలి నుంచీ సుధాకర్‌కు మద్దతు ఇస్తున్నారు. అదే మార్గంలో 31, 35, 36, 37, 42 వార్డుల వైసిపి కార్పొరేటర్లు, వైసిపికి చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు పయనిస్తున్నారు. వీరిలో 29, 31, 35, 37 వార్డుల కార్పొరేటర్లు వైసిపికి రాజీనామా చేసి సుధాకర్ గ్రూపులో ఇప్పటికే చేరిపోయారు. ఇంత జరిగినా దక్షిణ వైసిపి అభ్యర్థిగా వాసుపల్లి గణేష్ కుమార్‌ను పార్టీ కొనసాగించాలని నిర్ణయించడంతో సుధాకర్ అధికార పార్టీని వీడారు. ప్రస్తుతానికి ఆయన ఏ పార్టీలోనూ చేరలేదు. అయితే తెలుగుదేశం పార్టీలో చేరాలని ఇటీవల గట్టిగా నిర్ణయించుకున్నారు. ఇదే అభిప్రాయాన్ని టిడిపి అధిష్టానానికి తెలియజేసినట్టు సమాచారం. కచ్చితంగా టికెట్ ఇస్తామంటేనే పార్టీలోకి వస్తామని తెగేసిచెప్పినట్టు తెలుస్తోంది.

వార్తలు 8లో..



విశాఖలోని జగదాంబ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

ప్రభుత్వ నిర్బంధంపై..

ఆశాల ఆగ్రహం

విధుల బహిష్కరణ - ఎక్కడికక్కడ నిరసనలు, రాస్తారోకోలు



అనకాపల్లిలో రాస్తారోకో చేపట్టిన ఆశా కార్యకర్తలు

రవాణా సమ్మెను విజయవంతం చేయాలి

▶ వార్త మెయిన్‌లో..

జగన్‌పై హత్యాయత్నం కేసు నిందితుడు శ్రీను విడుదల

▶ వార్త మెయిన్‌లో..

నైపుణ్యాభివృద్ధిలో 8 ఎంఒయులు

▶ వార్త మెయిన్‌లో..

మోడీ తీరును ప్రశ్నిద్దాం..రండి !

ఎఐసిసి కార్యదర్శి ప్రణవ్‌ఝూ



మాట్లాడుతున్న ప్రణవ్‌ఝూ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం చేస్తున్న అకృత్యాలను దేశ పౌరులుగా అందరం ప్రశ్నిద్దామని ఎఐసిసి కార్యదర్శి, కమ్యూనికేషన్ విభాగ ఇన్‌ఛార్జి ప్రణవ్ ఝూ విజ్ఞప్తి చేశారు. అగ్నిపథ్ పేరిట ఉద్యోగాలంటూ నమ్మించి కేంద్ర ప్రభుత్వం చాలా మందిని మోసం చేసిందని, ఈ పోటీల్లో 50 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ నుంచి విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన నగరంలోని దక్షిణ నియోజకవర్గంలోని ఓ హోటల్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, తెలంగాణలో విజయదుందుభి మోగించిన కాంగ్రెస్ ఎపిలోనూ అత్యధిక మెజార్టీ సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న అకృత్యాల్ని ప్రశ్నించేందుకు రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర చేస్తోంటే బిజెపి శ్రేణులు అడ్డుకోవడం దారుణమన్నారు. మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోడీ కనీసం మాట్లాడలేదన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులకు మోడీ సమాధాన మివ్వాలన్నారు. ఎపి మిగతా 2లో..

అట్టహాసంగా ఆడుదాం - ఆంధ్ర

విశాఖలో రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆడుదాం - ఆంధ్ర రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు విశాఖ వేదికగా శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 26 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు, అధికారులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో బెలూన్లను ఎగురవేసి రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కె.రోజా క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, శాప్ ఎమ్‌డి ధ్యాన్ చంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఇతర అధికార, రాజకీయ ప్రముఖులతో కలిసి జాతీయ పతాకాన్ని, శాప్ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాకారులందరి చేతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధికారులతో కలిసి 26 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం



గాల్లోకి బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడుదాం - ఆంధ్ర అనేది అందరి ఆట.. బంగారు భవిష్యత్తుకు బాట..అని ప్రసంగిస్తూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేసిందని, క్రీడాకారులకు ఉన్నతమైన స్థానం కల్పించిందని పేర్కొన్నారు. 15,400 సచివాలయాల పరిధిలో వివిధ దశల్లో ఆడుదాం - ఆంధ్ర ద్వారా ఎంతో మందిని ఈ క్రతువులో మిగతా 2లో..

ఇళ్ల పట్టాల కోసం ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లో 80 సంవత్సరాలుగా నివాసముంటున్న ప్రజలు తమకు ప్రభుత్వం ఇస్తానన్న ఇళ్ల పట్టాలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణా మార్కెట్ బౌదారా రోడ్డులో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు సిమ్మ అప్పారావు, పైడిరాజు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా గత టిడిపి ప్రభుత్వ హయాంలో 2018లో 296, 338 జిఒల ద్వారా ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని చెప్పినప్పటికీ చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వం ఇదే అంశంపై జిఒ నెంబర్ 60, 125లు ఇచ్చి, ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.550 చొప్పున చలానా కూడా కట్టించుకొని ఇప్పటిదాకా పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇప్పటికే కార్పొరేటర్, తహశీల్దార్, ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ కలగలేదన్నారు. కార్యక్రమంలో గౌరి శంకర్, బాబ్జీ, బంగార్రాజు, అప్పారావు, శివ, రత్నం, వరలక్ష్మి, అప్పలనరసమ్మ, నాగలక్ష్మి, చంద్రమ్మ, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన ప్రసాద్ గార్డెన్స్ పేదలు

మొదటి పేజీ తరువాయి..



బ్యాడ్మింటన్‌లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

అట్టహాసంగా ఆడుదాం - ఆంధ్ర

భాగస్వామ్యం చేశామని గుర్తు చేశారు. క్రీడాకారులు తమ ఆటపై ఫోకస్ పెట్టాలని, ఉన్నత స్థానాలకు చేరుకునే వరకు విశ్రమించవద్దని సూచించారు. అందరి లక్ష్యం గెలుపే కావాలని, ఆ దిశగా నిరంతరం శ్రమించాలని అన్నారు. శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, చిన్నచిన్న కామెంట్లను పరిగణనలోకి తీసుకొని కుంగిపోవద్దని సూచించారు. శాప్ ఎమ్‌డి ధ్యాన్ చంద్ర మాట్లాడుతూ డిసెంబర్ 26న ఆరంభమైన క్రీడలు 41 రోజుల నుంచి నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 13వ తేదీన విశాఖలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ముగింపు వేడుకలు ఉంటాయని చెప్పారు. ఆడుదాం - ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 37.35 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా అందులో 13.77 లక్షల మంది మహిళా క్రీడాకారులు ఉండటం విశేషమని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన క్రీడల్లో విజేతలకు రూ.12 కోట్లతో బహుమతులు అందజేశామని, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.87 లక్షలతో బహుమతులు అందజేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, క్రికెట్ జాతీయ క్రీడాకారుడు శ్రీకర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ తీరును ప్రశ్నిద్దాం..రండి !

ప్రభుత్వంలో లీడర్‌షిప్ మారాలన్నారు. కార్యక్రమంలో ఎపిసిసి ఉపాధ్యక్షులు వేగి వెంకటేష్, కాంగ్రెస్ విశాఖ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొంప గోవిందరాజు, తిలారి సురేష్, ప్రధాన కార్యదర్శి కాకినాడ చినబాబు, పార్టీ నేతలు హైదర్ అలీ సింకా, గుర్రం కనకారావు, వాసుపల్లి దానయ్య, చెల్లుబోయిన నాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

బాబు జీవిత కాలంలో
ఒక్కో పార్టీతో ఎన్నోసార్లు పొత్తులు : మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రాష్ట్రంలోని రాజకీయ పార్టీల్లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు ఒక అజెండా, విధానం అంటూ ఏమీ లేదని, ఆయన రాజకీయ జీవితంలో ఒక్కో పార్టీతో ఎన్నోసార్లు పొత్తులు పెట్టుకోవడం సిగ్గుచేటైన విషయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన నేషనల్ స్కిల్ కాన్‌క్లేవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ 2014లో బిజెపి-టిడిపి సంకీర్ణంలో ఉన్నప్పుడు టిడిపి విభజన హామీలన్నింటినీ గాలికొదిలేసిందన్నారు. వైసిపి అజెండా పేదల సంక్షేమమేనన్నారు. సిఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. దేశంలో కాంగ్రెస్, బిజెపి, వామపక్ష పార్టీలకు వేర్వేరు సిద్ధాంతాలున్నాయని, అయితే జనసేన పార్టీ సిద్ధాంతం ఏమిటో ఇప్పటికీ అర్థం కావడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఒక్క వైసిపితో తప్ప చంద్రబాబు అన్ని పార్టీలతో పొత్తులకు రెడీ అంటున్నారని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు.



విసికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

ఎయు విసిని కలిసిన ఎంపీ ఎంవివి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ శుక్రవారం ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో 308 మంది ఆల్ హాస్టల్ డైలీ వర్కర్స్‌గా తక్కువ వేతన కార్మికులుగా పనిచేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

సెక్యూరిటీ గార్డుల
బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న వారికి బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలను చెల్లించాలని సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ముద్రించిన కరపత్రాలను శుక్రవారం కెజిహెచ్‌లో పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న వస్త్ర ప్రదర్శన



ఎక్స్‌పోలో చీరను ప్రదర్శిస్తున్న మహిళ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రానున్న వివాహ సీజన్ సందర్భంగా నేషన సిల్క్ ఎక్స్‌పో వారు ఐదు రోజులపాటు తలపెట్టిన వస్త్ర ప్రదర్శన హోటల్ గ్రీన్ పార్క్, వాల్తేరు మెయిన్ రోడ్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పోలో అద్భుతమైన ఎత్నిక్ వస్త్రాలు, సంప్రదాయ ప్రింట్లను అందుబాటులో ఉంచారు. ఎన్నో రకాల చీరలు, సల్వార్‌లు, టాప్‌లు, లెనిన్ వస్త్రాలు ఇక్కడ కొలువుదీరాయి. పోచంపల్లి, కలంకారి చీరల నుంచి సంప్రదాయ కోల్‌కతా, భాగల్పురి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్స్, బెనారస్ సిల్క్ వరకు వస్త్రాలు ఆకట్టుకున్నాయి. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీనుబాబు

యువశక్తి సదస్సుకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన లక్ష్యంగా పల్సస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యువశక్తి సదస్సుకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఉదయం సిరిపురంలోని గురుజాడ కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న పల్సస్ గ్రూప్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖతోపాటు ఆంధ్రా యువతకు సాధికారత కల్పించడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిజిటల్ యుగంలో నేటి యువత ముందుండాలని, అందుకోసం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను నిరంతరం అభ్యసించాలని సూచించారు. తమ సంస్థ ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో 10 వేల మంది ఇంజినీరింగ్, వివిధ డిగ్రీ పట్టభద్రులు పాల్గొన్నారు.

థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఆసుపత్రుల శానిటేషన్ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేయాలని గవర్నమెంట్ హాస్పిటల్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి. వెంకటరావు డిమాండ్ చేశారు. కృష్ణా కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ ఆసుపత్రులలో థర్డ్ పార్టీ కాంట్రాక్టు కార్మికులుగా శానిటేషన్ కార్మికులు, సెక్యూరిటీ కార్మికులు వందలాది మంది పనిచేస్తున్నారన్నారు. వీరికి నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. కాంట్రాక్టు శానిటేషన్ కార్మికులపై కృష్ణా కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్ దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని తెలిపారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రుల ఛైర్మన్, జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ జగదాంబ జోన్ నాయకులు వై.రాజు, సిఐటియు నాయకులు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు

1044వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను యథావిధిగా ప్రభుత్వ రంగంలోనే నడపాలని, ఈ కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేసే నిర్ణయాన్ని రద్దు చేయాలని, జిందాల్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారం నాటికి 1044వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. దీక్షల్లో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు చరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పిసిఎల్ యాజమాన్యానికి సమ్మె నోటీసు



నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి -ములగాడ : కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంఆ ఈనెల 16న ఒక్కరోజు పారిశ్రామిక సమ్మె, దేశవ్యాప్త బంద్‌లో భాగంగా హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో యాజమాన్యానికి శుక్రవారం సమ్మె నోటీసును అందజేశారు. హెచ్‌పిసిఎల్ సెక్యూరిటీ మేనేజర్ విజయకుమార్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌తోపాటు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం, ఇతర ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేసి, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలను కల్పించాలని, విభజన హామీలను అమలు చేయాలన్న డిమాండ్లతో బంద్ పాటిస్తున్నట్లు వెల్లడించారు.

పిఠికి భారతరత్నపై హర్షం

ప్రజాశక్తి - గోపాలపట్నం : తెలుగు తేజం, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధానమంత్రి పివి.నరసింహారావుకు దేశ అత్యుత్తమ పురస్కారం భారతరత్న ప్రకటించడంపై పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు హర్షం వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడుతూ సంక్షోభ కాలంలో దేశ 9వ ప్రధానిగా పలు సంస్కరణలను చేపట్టి, దేశ ఆర్థిక పరిస్థితిని గాడీలో పెట్టారన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని, ఆత్మగౌరవాన్ని అన్న ఎన్‌టిఆర్ విశ్వవ్యాప్తం చేస్తే, దేశ ప్రధానిగా పివి. నరసింహారావు తెలుగుదనానికి కీర్తి తెచ్చారని కొనియాడారు.

పద్మనాభం : అపర మేధావి, మాజీ ప్రధాని పివి.నరసింహరావుకు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించడంపై పాండ్రంగి గ్రామానికి చెందిన మహంతి శ్రీను హర్షం వ్యక్తం చేశారు. తెలుగు బిడ్డ పివికి ఇంతటి గౌరవం దక్కడం గర్వకారణమని, ఇప్పటికైనా పివి సేవలను గుర్తించి, భారతరత్న పురస్కారానికి ఎంపిక చేసిన ప్రధానిమోడీకి కృతజ్ఞతలు తెలిపారు.

పేరుకుపోయిన చెత్తతో పరేషాన్!

గెడ్డల్లో నిండిపోయిన వ్యర్థాలు
దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు
తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల వినతి





రామకృష్ణ నగర్ గెడ్డలో చెత్తాచెదారం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులో గెడ్డల్లో చెత్త పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. తీవ్ర దుర్వాసన వ్యాపించి, దోమలు విజృంభించి అవస్థలు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

26వ వార్డు రామకృష్ణనగర్ చెన్నూరు మసీదు వద్ద గెడ్డలో చెత్తాచెదారంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారిందని, దీంతో దుర్వాసనతోపాటు జ్వరాలు, వ్యాధులతో జనాలు అల్లాడి పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. గెడ్డ పక్కనే అంగన్వాడీ పాఠశాల ఉండడంతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరౌతున్నారు. మరోవైపు రామకృష్ణ నగర్ మర్రిచెట్టు వద్ద గెడ్డలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను జివిఎంసి యంత్రాంగం రెండు నెలలుగా తొలగించడం లేదని వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, తక్షణమే గెడ్డలో నిలిచిన చెత్తను తొలగించడంతోపాటు, నిత్యం పారిశుధ్య పనులు చేపట్టి, గెడ్డ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు కనకమ్మ, షేక్ మున్నీషా తదితరులు కోరుతున్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలో పొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టువ్యాధి నివారణాధికారి గురునాథరెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాధిపై విద్యార్థి దశ నుంచి అవగాహన ఉండాలని, వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యపరీక్షలు చేయించుకుని తగు చికిత్స పొందితే నయమౌతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరరావు, అప్పలరాజు, సచివాలయ ఎఎన్ఎం పార్వతి, అంగన్వాడీ సీతాదేవి పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత యోగా శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ నెల 14 నుంచి 24 వరకు మహిళలకు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రముఖ యోగా శిక్షకురాలు సులోచన తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 12వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జివిఎంసి పదవ వార్డు, పాత డెయిరీఫారం, ఆదర్శనగర్‌లోని లిటిల్ కిడ్డీస్ ప్లేస్కూల్లో ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు. పేర్ల నమోదుకు 9493528285, 950809688 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు కొత్తపాలెంలో శనివారం గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవాన్ని గౌరీసంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు ముగింపుగా శనివారం ఉదయం గౌరీ పరమేశ్వరులను ఊరేగిస్తారు. అనంతరం ప్రదర్శనగా తీసుకెళ్లి అనుపోత్సవం నిర్వహిస్తారన్నారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే పి.గణబాబు, వైసిపి సమన్వయకర్త ఆనంద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ తదితర నాయకులు పాల్గొంటారని కొత్తపాలెం గౌరీ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

సమస్యలను పరిష్కరించాలని

రైల్వే వేగన్ కార్మికుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వడ్లపూడి రైల్వే వేగన్ కార్మికులు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం రైల్వే వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. వేగన్ కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈనెల 16న దేశవ్యాప్త బంద్‌లో వడ్లపూడి రైల్వే వేగన్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు గాజువాక జోన్ నాయకులు ఎం రాంబాబు మాట్లాడుతూ, కార్మికులకు భద్రత, సమాన పనికి సమాన వేతనం, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అవతారం, రాజు,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వతంత్ర నగర్‌లో పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడో వార్డు స్వతంత్రనగర్‌లో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.2.50కోట్ల వ్యయంతో నిర్మించిన పార్కును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ పిల్లా మంగమ్మ ప్రారంభించారు. ఈ పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్, పగోడాలు వాకింగ్ ట్రాక్, యోగ, జిమ్, వాలీబాల్ కోర్టు, పచ్చదనంతో కళకళలాడేందుకు ఉద్యానవన శాఖ సాయంతో వివిధరకాల పూలమొక్కలు, పచ్చిక బయళ్లు, వాటర్ ఫౌంటెయిన్ వంటి అధునాతన హంగులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, ప్రజలకు ఒత్తిడి నుంచి ఉపశమనానికి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో పార్కును అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. పార్కును పరిశుభ్రంగా ఉంచి వినియోగించుకోవాలని కోరారు.

కార్పొరేట్ల ప్రయోజనాలకే భూహక్కుల చట్టం

బార్ అసోసియేషన్, స్టీరింగ్ కమిటీ ప్రతినిధుల ధ్వజం



మాట్లాడుతున్న స్టీరింగ్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి- భీమునిపట్నం : కార్పొరేట్ల ప్రయోజనాలే లక్ష్యంగా ఎపి భూ హక్కుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని బార్ అసోసియేషన్, స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన చిట్టివలస బంతాట మైదానంలో ఎపి భూహక్కుల యాజమాన్యం చట్టం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ చైర్మన్ ప్రముఖ న్యాయవాది బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఏకరూప భూహక్కుల చట్టం ఉండాలన్న నీతి ఆయోగ్ లక్ష్యం వెనుక కార్పొరేట్లు, పెత్తందారుల ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపించారు. నీతిఅ-యోగ్ ఆదేశించడమే తడవుగా ఎపిలో ఆగమేఘాల మీద అమలుకు ఉపక్రమించడం దుర్మార్గమన్నారు.
బార్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైతులు, పేదల ఆస్తి హక్కులకు తీవ్ర విఘాతం కలిగించే ఎపి ల్యాండ్ టైటి లింగ్ యాక్ట్,2023 రద్దుకు పోరాడాలని, దానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు మాట్లాడుతూ, దోపిడిపూరిత చట్టం నుంచిశాశ్వత విముక్తి కోసం ప్రజలంతా సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు సదస్సులో స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు వేణుగోపాలరావు, పి.గిరిధర్, భీమిలి బార్ అసోసియేషన్ కార్యదర్శి నమ్మి సూరిబాబు, కోశాధికారి ఎం.సునీల్, జాయింట్ సెక్రటరీ బి.సూర్యప్రకాశరెడ్డి, న్యాయవాదులు టి.శ్రీనివాసరావు, ఎస్ వాయునందన, ఎస్ శ్యామ్‌కుమార్, పి బాలభాస్కరరావు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయాలి

పద్మనాభం : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని విశాఖపట్నం బార్ అసోసియేషన్, స్టీరింగ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన పద్మనాభం జంక్షన్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటికే ప్రభుత్వ భూములను ఆస్తులను భవనాలను తాకట్టు పెట్టేసిన ప్రభుత్వం, ఈ చట్టం పేరుతో భూమి ఆస్తుల పత్రాలను ప్రపంచ బ్యాంకు చేతుల్లో పెట్టి అప్పులు తెచ్చుకునే ఎత్తుగడలో ఉందన్నారు. సివిల్ కేసులు, భూవివాదాలన్నీ ప్రభుత్వ అధీనంలోని ట్రిబ్యునల్ పరిధిలోకి వెళితే, రైతులు, ప్రజలు ఇబ్బందులు పడక తప్పదన్నారు. ఈచట్టంతో సిఆర్‌టిసి సెక్షన్ 41ఏను ప్రజలపై బలవంతంగా రుద్ది, పోలీస్‌స్టేషన్లకు విస్తృత అధికారాలు ఇవ్వడం ద్వారా సివిల్ వ్యవహారాలు, భూవివాదాల్లో ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రతినిధులు జోక్యం పెరిగిపోవడం ఖాయమన్నారు. ఈ చట్టంతో వచ్చే ముప్పుపై అవగాహన కలిగి, సమిష్టిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న స్టీరింగ్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డిఇఒ చంద్రకళ సూచించారు శుక్రవారం టిపిటి కాలనీలోని ఎన్ఎంసిహెచ్ స్కూల్‌లో జాతీయ భద్రత మహోత్సవంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి, దానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు విద్యార్థి దశలో చెడు అలవాటులకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి- భీమునిపట్నం : నేరెళ్లవలసలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయంలో టెన్త్ విద్యార్థులకు చిప్పాడ ది వీస్ ఆధ్వర్యాన శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 26 మంది టెన్త్ విద్యార్థులకు ఎంఇఒ ఎం శివరాణి స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం శివలక్ష్మి, ఎన్‌జిఒ పి మంగపతిరావు, దివీస్, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు పి శేఖర్‌బాబు, పి పైడినాయుడు పాల్గొన్నారు

డ్వాక్రా రుణాలకు సున్నా వడ్డీ వర్తింపజేయాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

ప్రజాశక్తి- ములగాడ: డ్వాక్రా సంఘాలన్నింటికీ సున్నా వడ్డీ వర్తింపజేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. శుక్రవారం 63వ వార్డు క్రాంతినగర్‌లో ఆంధ్రప్రదేశ్ డ్వాక్రా సంక్షేమ సంఘం. మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఏరియా కార్యదర్శి వై కల్యాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు స్వయంఉపాధికి శిక్షణనిచ్చి, ఆర్థిక స్వావలంబనకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రుణమాఫీ, గ్యాస్ సిలెండర్లు, ఇతరత్రా తాయిలాలతో ఎరవేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం సరికాదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రోల్,డీజిల్ ధరలను విపరీతంగా పెంచడంతోపాటు ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడంద్వారా వాటి ప్రభావం అన్ని వర్గాల ప్రజలపై పడేలా చేస్తోందని దుయ్యబట్టారు. ఇక రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నిత్యావసరాలతోపాటు అన్ని ధరలను, కరెంట్, బస్‌ఛార్జీలను విపరీతంగా పెంచేయడంతోపాటు చివరకు చెత్తను కూడా వదలకుండా పన్నులు విధించి, వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మహిళలంతా సంఘటితంగా వీటిపై పోరాడాలని పిలుపునిచ్చారు.ఐద్వా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.విమల మాట్లాడుతూ, విశాఖ నగరంలో తొలిసారిగా ఈనెల 22 నుంచి 25వకు ఐద్వా జాతీయ సమావేశాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా ఈనెల 22న వేలాది మహిళలతో భారీ ప్రదర్శన, బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎం.లక్ష్మి, కె.అన్నపూర్ణ, పి.వరలక్ష్మి, బి.రాజేశ్వరి, టి.అసిమ్మ, ఆదిలక్ష్మి, గోవిందమ్మ, ఊర్మిళ, గీత, రవణమ్మ, దొడ్డమ్మ,లక్ష్మి పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు ఐద్వా కృషి

గోపాలపట్నం : మహిళా హక్కుల సాధనకు ఐద్వా నిరంతరం పోరాడుతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి వై సత్యవతి అన్నారు. శుక్రవారం జివిఎంసి 90వ వార్డు విమాన నగర్‌లో ఐద్వా గోపాలపట్నం శాఖ అధ్యక్షురాలు వి.ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ, ఇంకా అక్కడక్కడ పురుషాధిక్యత కనిపిస్తోందన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి, హక్కులసాధనకు సమిష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖలోఈ నెల 23, 24,25 తేదీల్లో నిర్వహించే ఐద్వా జాతీయ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా ఐద్వాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విసిసి కన్వీనర్ బి.లీలావతి, ఐద్వా నేతలు బి.కాంతం, ఎస్ లక్ష్మి మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

అంధ దళితుడి దుకాణం తొలగింపు



బడ్డీని తొలగించి రోడ్డుపై పడేసిన సరుకులు

ప్రజాశక్తి-ఆనందపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో అంధుడైన దళితుడు సింహాద్రి పాండు ఏర్పాటు చేసుకున్న కిల్లి బడ్డీని శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఖాళీ స్థలంలో సింహాద్రి పాండు చిన్న దుకాణాన్ని పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాడు. ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్నాడని సమీపంలో ఉన్న భూస్వామి ఫిర్యాదు మేరకు బడ్డీని తొలగించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అంధుడైనప్పటికీ, ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా చిన్న బడ్డీని ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్న పాండు బడ్డీ తొలగించి, అతని పొట్టకొట్టడం అన్యాయమని దళిత నాయకులు సియాద్రి రాంబాబు ఆరోపించారు.

వైవితో జియ్యాని భేటీ



సుబ్బారెడ్డిని కలిసిన శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి. సుబ్బారెడ్డిని తాడేపల్లిలోని అతని నివాసంలో గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు సమస్యలపై చర్చించినట్లు శ్రీధర్ తెలిపారు.

డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలి



జెడ్‌సిని అభినందిస్తున్న కాంగ్రెస్‌నేత నాయుడు, తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కాంగ్రెస్ నేతలు కోరారు. శుక్రవారం గాజువాక జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దుర్గాప్రసాద్‌ను కాంగ్రెస్ నేతలు చెల్లుబోయిన నాయుడు, అప్పలరాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. తర్వాత సమస్యలపై వినతిపత్రం అందజేశారు.జోన్‌పరిధిలో పారిశుధ్యం, ప్లాస్టిక్ సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. పారిశుధ్య సమస్యతో పాటు, ప్లాస్టిక్ సమస్య పరిష్కరించాలని కోరారు.

రెండో వార్డులో జెడ్‌సి పర్యటన



రెండో వార్డులో పర్యటిస్తున్న జెడ్‌సి శైలజ వల్లి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఒకటో జోన్ కమిషనర్ జి శైలజ వల్లి పర్యటించారు. నిర్వాసిత ప్రాంతం నమ్మివానిపేట మెట్ట వద్ద సిమెంట్ కాలువలు, రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్యం తగదు



రిలేదీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అజశర్మ

ప్రజాశక్తి-కరాస: ఉద్యోగులు, పెన్షనర్లు దాచుకున్న రూ.లక్షల కోట్లను పెట్టుబడిదారులకు ధారపోసి, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ మండిపడ్డారు. కనీస పెన్షన్ రూ.9వేలు అమలు, వైద్యసదుపాయం కల్పించాలన్న న్యాయమైన డిమాండ్‌తో రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న ఇపిఎఫ్ 95 పెన్షనర్లను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. శుక్రవారం మర్రిపాలెం ఇపిఎఫ్ కార్యాలయం వద్ద ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ ఆధ్వర్యంలో నిరవధికంగా ఐదోరోజు కొనసాగించిన నిరవధిక రిలే దీక్షల్లో పాల్గొని మాట్లాడారు. ధరాభారంతో ఇస్తున్న పెన్షన్ ఎటూ సరిపోక జీవనం దుర్భరమౌతోందని, కనీస పెన్షన్‌ను రూ.9వేలకు పెంచాలని, పెన్షనర్ల దంపతుల ఆరోగ్యానికి భరోసాగా వైద్యసదుపాయం కల్పించాలన్న కనీస కోరికను తీర్చాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పుకోవడం దుర్మార్గమన్నారు.పెన్షనర్ల నుంచి రికవరీ చేసిన సొమ్మును బట్టి ఒక్కొక్కరికీ కనీసం రూ.6,886 నెలసరి పెన్షన్ ఇవ్వొచ్చని, అదే సొమ్మును బ్యాంకులో జమచేస్తేవచ్చే వడ్డీలతో కలుపుకుంటే ప్రస్తుతమిస్తున్న దానికన్నా రెండుమూడు రెట్లు అధికంగా పొందవచ్చన్నారు. ఇపిఎఫ్ పెన్షనర్ల సొమ్ములను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టి, వీరికి మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తన బాధ్యతను గుర్తెరిగి, పెన్షనర్ల కోరికను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిటి. మూర్తి, దీనబంధు, ఉపాధ్యక్షుడు యువిఎస్.శర్మ, ఎస్‌కె. హుస్సేన్, నారాయణరావు, కె.సూర్య నాయుడు, చంద్ర శేఖరరావు, అప్పలరాజు, బాలాజీ, రామారావు, అప్పారావు, ప్రసాద్, వివిధ పరిశ్రమల పెన్షనర్లు పాల్గొన్నారు.

మంత్రి రోజాను కలిసిన కార్పొరేటర్ సురేష్



రోజాతో కార్పొరేటర్ సురేష్

ప్రజాశక్తి- ములగాడ: విశాఖ రైల్వే స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించేందుకు వచ్చిన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలను 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్,ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, 43వ వార్డు కార్పొరేటర్ పి ఉషశ్రీ. శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రోజాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని తర్లువాడలో మజ్జి అప్పారావు స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలకు శుక్రవారం బహుమతులను అందజేశారు. స్థానిక ఎంపిపి డాక్టర్ మజ్జి శారద ప్రియాంక, మజ్జి వెంకటరావు బ్రదర్స్ అండ్ సన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఎఆర్ క్రికెట్ టోర్నీలో శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌గా తర్లువాడ, మూడవ స్థానంలో పద్మనాభం మండలం కోరాడ జట్లు నిలిచాయి. విజేత మిందివానిపాలెం జట్టుకు రూ.25వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందజేశారు. రన్నరప్ తర్లువాడ జట్టుకు రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కోరాడ జట్టుకు రూ.10వేలు నగదు, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమానికి ముందు అప్పారావు చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి ఘననివాళి అర్పించారు. అనంతరం భజన, మజ్జి వెంకటరావు బ్రదర్స్ అండ్‌సన్స్ సౌజన్యంతో భోజనాలు, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఎండాడ అనాధ శరణాలయంలోని పిల్లలకు భోజనాలను సమకూర్చారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శారద ప్రియాంక, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగి గోస్తనీ వంతెన పనుల్లో కదలిక

అంచనా వ్యయం పెంపుతో మొదలైన నిర్మాణం ... చురుగ్గా మట్టి నమూనాల పరీక్షలు

ప్రజాశక్తి-పద్మనాభం : మన్యం వీరుడు అల్లూరి స్వగ్రామం పాండ్రంగి వద్ద గోస్తని నదిపై వంతెన నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది.బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్ల ఏర్పాటుకు మట్టి నమూనాలను సేకరించి, పరీక్షించే పనులను చురుగ్గా చేపడుతున్నారు.

పాండ్రంగి వద్ద వంతెన నిర్మాణానికి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.14కోట్ల నిధులను మంజూరు చేయించి, డిసెంబర్ 16న శంకుస్థాపన చేశారు. అయితే రెండు నెలలైనా పనులు చేపట్టకపోవడంతో, ఎన్నికల ముందు లబ్ధిపొందేందుకు శంకుస్థాపన హడావిడి చేశారనే విమర్శలు వచ్చాయి.

అయితే వంతెన నిర్మాణానికి కేటాయించిన నిధులు చాలవని, అలాగే ఎన్నికలకు ముందు పనులు చేసే బిల్లులు వస్తాయో, లేదో అన్న సందిగ్ధంతో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్లే కాలయాపన జరిగిందనే వాదన వినిపించింది. దీనిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి చొరవ తీసుకుని, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో అదనంగా మరో రూ.రెండు కోట్లు మంజూరు కావడంతో, ప్రస్తుతం రూ.16కోట్లతో వంతెన పనుల్లో కదలిక వచ్చింది.




పాండ్రంగి వద్ద గోస్తనీ నదిపై సాగుతున్న వంతెన పనులు

పాండ్రంగి వద్ద గోస్తనీ నదిపై ఏడు పిల్లర్లతో 714అడుగుల పొడవైన వంతెనను నిర్మించాలన్న అంచనాలతో పిల్లర్ల వద్ద మట్టి నమూనాలను సేకరించి, విశ్లేషిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు పిల్లర్లకు సంబంధించి మట్టిని సేకరించి, పరిశీలనకు పంపగా, నివేదిక ఆధారంగా పనులు ఊపందుకోనున్నాయి. కాగా పాండ్రంగి వంతెన పనులపై రాజకీయ విమర్శలు జోరుగానే వినిపిస్తున్నాయి. ఇపుడు హడావిడి చేసి, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కోడ్ అంటూ కాలయాపన చేసే అవకాశం ఉందనే విమర్శలూ ఉన్నాయి. ఏం జరుగుతుందో చూడాలి మరి.

అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి పునర్నిర్మాణం చేయకుంటే

రోడ్లు దిగ్బంధం చేస్తాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం
- రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి వినతి



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వెళ్లే రోడ్డును వెంటనే పునర్నిర్మాణం చేయకుంటే రహదారులను దిగ్బంధం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం హెచ్చరించారు. ఈ మేరకు అనకాపల్లి బైపాస్ రోడ్డు వద్దకు రోడ్డు పరిశీలనకు శుక్రవారం వచ్చిన రోడ్డు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆంజనేయరాజును లోకనాథం నేతృత్వంలో సిపిఎం బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలకు కనీసం చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఈ ప్రాంతంలో అనేక పరిశ్రమలు, సంస్థలు ఏర్పాటు చేసే క్రమంలోనే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా చిన్నపాటి ఆర్ అండ్ బి రోడ్‌లోనే భారీ వాహనాలు నడుపుతూ ఈ ప్రాంత ప్రజలందరికీ నరకం చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ రోడ్డు సమస్యలపై ఇప్పటికే సిపిఎం అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు వేయాలని, ఈ మార్గంలో భారీ వాహనాల నిలుపుదల చేయాలని, గడ్డర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆర్ అండ్ బి ఈఇని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్, వివి శ్రీనివాసరావు, కాంగ్రెస్ రామ సదాశివరావు, కర్రి అప్పారావు, ఆళ్ల మహేశ్వరరావు, బుద్ద రంగారావు, బి.ఉమామహేశ్వరరావు తదితరులున్నారు.

12న భారీ మానవహారాన్ని జయప్రదం చేయాలి

మునగపాక : అనకాపల్లి నుండి అచ్యుతాపురం వరకు రోడ్డు మార్గాన్ని వెంటనే పునర్నిర్మించాలని, భారీ వాహనాలు నిలుపుదల చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ ఈనెల 12న చేపడుతున్న భారీ మానవహారంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ కన్వీనర్ కాంగ్రెస్ రామ సదాశివరావు పిలుపునిచ్చారు. మండలంలోని నాగులపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నాగులపల్లి నుంచి అచ్యుతాపురం వరకు గల గ్రామాల ప్రజల అందరితో భారీ మానవహారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామం నుంచి ఈ మానవహారానికి భారీగా ప్రజలు తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం సమస్య పరిష్కారం చేయకపోతే ప్రజలందరి సహకారంతో నిరవధిక రోడ్డు దిగ్బంధం, బంద్‌కు కూడా వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఎల్లపు భాస్కరరావు, ఆళ్ల మహేశ్వరరావు, వివి శ్రీనివాసరావు, ఎస్ బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న రామసదాశివరావు

మెగా కాదు.. ఎన్నికల డిఎస్‌సి

ప్రజాశక్తి- అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని, అది ఎన్నికల డిఎస్సీ అని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50,892 ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం కంటి తుడుపుగా 6100 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడం నిరుద్యోగులను వహించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది కూడా అప్రెంటీస్ విధానం అమలు చేయడం దారుణమన్నారు. 2019 ఎన్నికల్లో హామీల్లోని ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, ప్రభుత్వంలో ఉన్న 2 లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ ఏమయ్యాయో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ నిర్వాకం వల్ల దేశవ్యాప్తంగా 11శాతం నిరుద్యోగులు ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో 24 శాతం ఉన్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, బుద్ద కాశి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అమరగాయకులు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యాన జివిఎంసి గవరపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం పాటల పోటీలు నిర్వహించారు. ముందుగా ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి లర్పించారు. పోటీలు అనంతరం విజేతలకు హైస్కూల్ హెచ్ఎం ఆదిరెడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కలసి ప్రశంసాపత్రాలను, ఘంటసాల పురస్కార మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నాయకులు పట్నాల కృష్ణ మోహన్, వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, కొత్తూర్తి రామారావు, ఉపాధ్యాయులు కె.దుర్గా ప్రసాదరావు, కె.రాము, ఎ.అచ్చియ్యనాయుడు, ఎమ్.రత్న కుమారి, పూర్ణిమ, స్వర్ణమయి, పాలేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిడిమాంబ అమ్మవారి సారె ఊరేగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేటలో శ్రీ మరిడిమంబ అమ్మవారి ఆలయం 8వ వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. విజయరామరాజుపేట చుట్టుపక్కల వీధులు నుండి మహిళలు వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు తయారు చేసి ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ, కార్యదర్శి పలక రాము, ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, ట్రెజరర్ పిట్టబుద్దేశ్వరరావు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

3 నెలల వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులకు, సెక్యూరిటీ సిబ్బందికి బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటియుసి అనకాపల్లి జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఈ కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే ఏం తిని బతుకుతారని ప్రశ్నించారు. పర్మినెంట్ చేస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి తుంగలోకి తొక్కారన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అర్బన్ ఆరోగ్య కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి కొట్నివీధి గొల్లవీధి, అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డిల్లీ యూపీహెచ్‌ఎస్ పరిశీలన బృందం సందర్శించింది. కేరళ రాష్ట్ర డిఎంహెచ్ఓ పిఎన్ విద్యాధరన్, నాగల్యాండ్ రాష్ట్ర క్వాలిటీనోడల్ అధికారి డాక్టర్ సజియా సహిం, యుపిహెచ్‌సి పరిశీలించి ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలన కమిటీ సభ్యులను 84వ వార్డు ఇంచార్జ్ కోరుకొండ రాఘవ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర, మరిడిబాంబ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్ని శ్రీనివాస్‌రావు, కొణతాల సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా దేమునిగుమ్మంలోని వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ లెక్కింపు కశింకోట ఈఓ కీర్తి శ్రీనివాసరావు, దేవాలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవిందరావు, కార్యనిర్వహణాధికారిణి టి. రాజసులోచన, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. 43 రోజులకు గాను రూ.2,18,755 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, సూరిశెట్టి చిన్న సన్యాసిరావు, ముమ్మిని పైడిరాజు, శ్రీధరాల కోమలి రామ్మోహన్, రాజాన లక్ష్మీ శ్రీనివాసరావు, ఎక్స్ అఫిషియో మెంబర్ పులఖండం గిరిబాబు దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19లోగా సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్టీఐ చట్టం అమలుకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడంలో జాప్యమెందుకు, తక్షణం ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తుదారునికి అందజేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (ఎస్‌సిఐసి) ఆర్.మహబూబ్ బాష శుక్రవారం ఆదేశించారు. రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయానికి ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ చేసుకున్న దరఖాస్తులకు రాష్ట్ర సమాచార కమిషన్ పూర్తిగా స్పందించకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను కాండ్రేగుల వెంకటరమణ ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో వర్చువల్ విధానంలో శుక్రవారం రెండు అప్పీళ్ల (నెం.1252, 1253/ఎస్‌సిఐసి-ఆర్ఎంబి/2023) ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్ బాష విచారణ చేశారు. దరఖాస్తుదారు కోరిన పూర్తి సమాచారాన్ని 19వ తేదీలోగా అందజేయాలని విచారణలో ఆయన స్పష్టం చేశారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : రక్తహీనత, పోషకాహార లోపం నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపకరిస్తాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో 400 మిల్లీ గ్రాముల ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులచే మింగించారు. గవరపాలెం బాలికల ఉన్నత పాఠశాలలో డియం అండ్ హెచ్ఓ హేమంత్ పాల్గొని పిల్లలకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య జిల్లా అధికారి డాక్టర్ లూసి కార్లిలీయా, అరుంధతి నగర్ యుపిహెచ్‌సి వైద్యాధికారి వెంకట జయదీప్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలం మారేడుపూడి పంచాయతీలో సిసి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు కనకరాజు, ఎంపీటీసీ ఈగల రామునాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగల సూకరత్నం, ఈగల కృష్ణమూర్తి, వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపిపి సూరిబాబు

కంప్యూటర్ పరిజ్ఞానం అనివార్యం



పాఠశాల విద్యార్థులతో డాక్టర్ సుజీవ్ నాయర్ తదితరులు

ప్రజాశక్తి-పరవాడ : ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం అనివార్యంగా మారిందని రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ సీహెచ్ఆర్ఓ డాక్టర్ సుజీవ్ నాయర్ అన్నారు. తమ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు, దేశాలకు వెళ్లి ఉద్యోగం చేయటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. పాఠశాలకు మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందిస్తామని రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎమ్మీ రామిరెడ్డి ప్రకటించారు. వేదికపై నుంచి ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడిన విద్యార్థులను, మార్గనిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. సీడబ్ల్యూఎంపీ హెడ్ కె.రవికుమార్, ఫౌండేషన్ ప్రతినిధి కె.శ్రీకాంత్, పాఠశాల హెచ్ఎం కనకేశ్వరరావు, కమిటీ చైర్ పర్సన్ పి.పద్మావతి, ఉపాధ్యాయులు విక్టోరియా ఫ్రాన్సిస్, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకుండా నిఘా పెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె. అనంతలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నివారణకు చేపట్టవలసిన అంశాలపై ప్రధానోపాధ్యాయులకు జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐసిడిఎస్ పిఓలు, కమిటీ సభ్యులు నిఘా పెట్టి పోలీసు వారి సహకారంతో వివాహం జరగకుండా చూడాలన్నారు. దిశ డిఎస్‌పి డి.రామవర్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయించిన వారికి దానికి తోడ్పడిన వారికి న్యాయపరంగా విధించే శిక్షల గూర్చి తెలియజేయాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సూర్యనారాయణ మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగుతున్నట్లు గమనించిన వెంటనే తమకు తెలియజేసినట్లయితే రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ జిల్లా ప్రొబేషన్ అధికారి శరత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

మత్స్యకారులకు పడవల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ సామాజిక బాధ్యత నిధులతో రామ్‌కీ ఫౌండేషన్ అమలు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా సుజీవ్ మత్స్యకారులకు కొండకర్ల ఆవ వద్ద శుక్రవారం నాలుగు వేట పడవలను అందజేశారు. ఈ సందర్భంగా రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ సీహెచ్ఆర్ఓ డాక్టర్ సుజీవ్ నాయర్ మాట్లాడుతూ మత్స్యకారుల ఉపాధి అవకాశాలను మెరుగు పర్చడానికి తమ సంస్థ ఇతోధిక సహకారం అందిస్తోందని చెప్పారు. పట్టిన చేపల్ని మంచి రేటుకు అమ్మడమే కాకుండా ఈ వృత్తిలో అదనపు ఆదాయం పొందేందుకు కృషి చేయాలని సూచించారు. రామ్‌కీ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంవి.రామిరెడ్డి మాట్లాడుతూ ఆవలో చేపట్టిన చేపలను శాస్త్రీయ పద్ధతిలో ఎండబెట్టి, వీటితో స్నాక్స్ తయారు చేసుకునేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూఎంపి హెడ్ రవికుమార్, రామ్‌కీ ఫౌండేషన్ ప్రతినిధులు కనుమెట్ల శ్రీకాంత్, శ్రీనివాస్, రాజేశ్వరి, శివారెడ్డి, కమిటీ అధ్యక్షులు మళ్ళ రమణ పాల్గొన్నారు.



అన్న సమారాధన ప్రారంభిస్తున్న భరత్‌కుమార్

గ్రామాల్లో భరత్ కుమార్ పర్యటన

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కసింకోట మండలంలోని జమ్ముదులపాలెం, కొత్తపల్లి బుచ్చయ్యపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగ లక్ష్మిగున్నయ్య నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, కరక సోమునాయుడు, సర్పంచ్‌లు కరక రాజ్యలక్ష్మి శేషు, కరణం శ్యామ్ సన్ పాల్గొన్నారు.

అన్న సమారాధన ప్రారంభం

మండలంలోని ఎఎస్.పేట, నరసాపురం, గబ్బురుపాలెం గ్రామాల్లో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని మలసాల భరత్ కుమార్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మలసాల ధనమ్మ, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన భరత్‌కుమార్

అనకాపల్లి : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ శుక్రవారం పరిచయ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి, గవరపాలెంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని జె.తుని సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు ప్రారంభించారు. డాక్టర్ రమేష్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో సర్పంచ్ కొన అరుణ నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మేరీ జోన్స్, పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం

వైయస్సార్ ఆసరా 4వ విడత చెక్కులను శుక్రవారం స్థానిక శివాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం మండల పరిధిలోని 14 కోట్ల57 లక్షల రూపాయల చెక్కును అర్హులైన మహిళలకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసు, వైకాపా మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ, వైస్ ఎంపీపీలు బుద్ద గంగరాజు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం, దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డ్వాక్రా సంఘాల సభ్యులకు వైయస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి మండలంలో 7 కోట్ల60 లక్షల రూపాయలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, జెడ్పిటిసి దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

4వ విడత ఆసరాపై అవగాహన

కశింకోట : కశింకోట పంచాయతీలో దర్గావీధి గ్రామ సంఘంలో వైఎస్ఆర్ ఆసరా 4వ విడతపై లబ్ధిదారులకు ఏపీఎం శ్రీనివాసరావు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ సత్యనారాయణ, భారతి, పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు



విశాఖలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16న జరగనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దానిలో భాగంగానే విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌తో పాటు పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, చమురు సంస్థలు, గనులు, అంతరిక్షంతో పాటు రక్షణరంగాన్ని కూడా ప్రైవేటుపరం చేస్తోందన్నారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని, దానిని బలపరుస్తున్న రాజకీయ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13న సాయంత్రం నేవల్ డాక్‌యార్డ్ పైపులైన్ నుంచి, స్టీల్‌ప్లాంట్, బిహెచ్ఇఎల్‌ల నుంచి జింక్ గేటు వరకు బైకు ర్యాలీ, 14న ఉదయం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి బైకు ర్యాలీ, 16న సమ్మె అనంతరం గాజువాక, పెందుర్తి, తగరపువలస, విశాఖ నగరాల్లో భారీ కార్మిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, హెచ్ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.అప్పారావు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకరావు, కె.లక్ష్మి, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి దేవా, ఎఐసిటియు జిల్లా నాయకులు కె.శంకరరావు, ఎఐసిసిటియు నాయకులు రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల సమావేశం

16న సమ్మె జయప్రదానికి విశాఖ నగరంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, విశాఖ లారీ ఆపరేటర్స్, క్వారీ లారీ, ఆటో, మోటారు, క్యాబ్, టాటా మ్యాజిక్, వ్యాన్‌లు, లారీ, గ్యాస్ ట్యాంకర్స్, క్రేన్ ఆపరేటర్స్ సంఘాల నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. పి.రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఇతర నాయకులు జి.అప్పలరాజు, కె.సత్యనారాయణ, అప్పడు, శివ, సిహెచ్.శ్రీనివాసరావు, కాశీ విశ్వనాధం, రమణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్ జయప్రదానికై సమావేశం

అనకాపల్లి : కేంద్ర బిజెపి కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 16న జరుగు పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ని జయప్రదం చేయాలని వివిధ కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. 40 కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులకు నష్టం కలిగించి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు వచ్చే చట్టాలను తీసుకొచ్చిందని మండిపడ్డారు. రైతులకు నష్టదాయకమైన మూడు వ్యవసాయ చట్టాలపై ఢిల్లీలో ఏడాది పాటు రైతులు చేసిన పోరాటంతో దిగొచ్చిన మోడీ సర్కారు, వాటిని దొడ్డిదారిన అమలుకు పూనుకుంటుందని విమర్శించారు. మరోవైపు మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గండి నాయన బాబు, నగిరెడ్డి సత్యనారాయణ, బుద్ద రంగారావు, శంకర్రావు (రైతు సంఘాలు), ఆర్.శంకర్రావు, జి కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ (సిఐటియు), వైఎన్.భద్రం (ఎఐటియూసీ), కోన మోహన్ (రైతుకూలీ సంఘం), రాంబాబు (ఎఐఎఫ్‌టియు), బాలు గాడి (రైతు స్వరాజ్య వేదిక) పాల్గొన్నారు.



అనకాపల్లిలో సమావేశంలో పాల్గొన్న నేతలు

బ్రోకర్లకు అడ్డాగా తహశీల్దారు కార్యాలయం

మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల ఆరోపణ



సమావేశంలో నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- దేవరాపల్లి

స్థానిక తహసీల్దార్ కార్యాలయం బ్రోకర్లకు అడ్డగా మారిందని, రెవెన్యూ అధికారుల దగ్గర లేని రికార్డులు బ్రోకర్ల దగ్గర ప్రత్యక్షమవుతున్నాయని, రెవెన్యూ సిబ్బంది బ్రోకర్లకు కొమ్ము కాస్తున్నారని మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు ఎంపీటీసీలు మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన తాము ప్రజల్లోకి వెళితే సమస్యలు ఎదురవుతున్నాయని నిలదీశారు. పనులు చేపట్టే విషయంలోనూ, విధులు నిర్వహించే విషయంలోనూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, తక్షణమే అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని బి.కింతాడ, ఎ.కొత్తపల్లి, రైవాడ, వెంకటరాజపురం సర్పంచులు బూరె బాబూరావు, చింతల సత్య వెంకటరమణ, చల్లా లక్ష్మి , దాసరి సంతోష్ కుమార్ స్పష్టం చేశారు. వేచలం ప్రభుత్వ వైద్యాధికారి బి.హారిక మాట్లాడుతూ పిహెచ్‌సిలో రాత్రి వేళలో మద్యం మత్తులో ఆస్పత్రిలో సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. దీనిపై ఎంపీపీ రాజేశ్వరి స్పందిస్తూ తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. రీ సర్వే పనులు సక్రమంగా జరగలేదని, ఇందులో చాలా అవకతవకలు జరిగాయని రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, ఉపాధి హామీ ఎపిఒ ఏపీవో చంద్రకళ, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.సురేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'టిబి ముక్త్ పంచాయతీ'పై అవగాహన

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా క్షయ వైద్యాధికారి డాక్టర్ ఎంఎస్‌వికే బాలాజీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ పంచాయతీపై ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సబ్ కమిటీ మెంబర్ 6లో భాగంగా మునగపాక మండలంలోని గొల్లపాలెం, కాకరపల్లి, మల్లవరం, నారాయణపాలెం, రాజుపేట, అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం, కోడూరు, మాకవరం, మారేడుపూడి, పాపయ్యపాలెం, కసింకోట మండలంలో పేరంటాలపాలెం తదితర పంచాయతీలను గుర్తించినట్లు చెప్పారు. వీటిని క్షయ నుండి ముక్తి కలిగించడానికి గ్రామంలో అవగాహన కల్పించి 100శాతం చికిత్స అందిస్తామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించే దాతలను గుర్తించి వారి ద్వారా నెలనెల వారికి సరిపడా వస్తువులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి విమలగిరి, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారులు అయ్యప్ప రెడ్డి, రామకృష్ణ, బీపీఎం కోఆర్డినేటర్ ఏ ఎల్లాజీ, పీహెచ్సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్ దేవకాంత, సూపర్వైజర్లు ఉమామహేష్, విజయ లక్ష్మి, వెంకటరమణ, పెంటయ్య, గ్రామపంచాయతీ సెక్రటరీలు ఎస్ త్రినాథ్, సిహెచ్ శ్రీలక్ష్మి, బి సరోజిని, ఎస్కే శ్రీను, వి జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. తురకలపూడిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరి దేవి, జెడ్పీటీసీ దొండా, రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షులు జోగా కొండబాబు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, పిఎసిఎస్ పర్సన్ ఇంచార్జి బుదిరెడ్డి నాగభూషణం, సర్పంచ్ యర్రంశెట్టి గోవింద, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి-జనసేన విజయం ఖాయం

ప్రజాశక్తి-చోడవరం : వచ్చే ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమి గెలుపు ఖాయమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. పార్టీ కార్యకర్తలతో చోడవరం సీతారామ కళ్యాణ మండపంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి జనసేన పరస్పర అవగాహనతో ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు. జనసేన కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారని, వారికి మరింత ఆత్మస్థైర్యం కలిగించడానికి పర్యటనలో దోహదపడతాయని చెప్పారు. బిజెపితో సాధ్యమైనంత వరకు పొత్తు ఉంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నేత రాజు పాల్గొన్నారు.

రేపు ఎంపిడిఒ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ప్రారంభించనున్నట్లు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, మండల వైసిపి అధ్యక్షులు బూరె బాబూరావు శుక్రవారం తెలిపారు. రూ 2.50 కోట్లతో రాష్ట్రంలోని ఎక్కడా లేని విధంగా అత్యాధునిక హంగులతో ఈ భవన నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు.

పోలీసు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించేందుకు శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. 8 మంది పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయం నందు హాజరై అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. వీటికి ఎస్పి సానుకూలంగా స్పందించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

బొడ్డేరు సమీపాన ట్రెంచులు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట పంచాయతీలో అక్రమ ఇసుక రవాణాకు అదికారులు అడ్డుకట్ట వేశారు. ఇందుకు సంబంధించి వివరాలు.. లింగంపేట పంచాయతీలో భారీ మంచినీటి ప్రాజెక్టును 2013-14 మధ్య సుమారు 12 కోట్ల వ్యయంతో గొలుగొండ మండలంలో ఉన్న 16 గ్రామాలకు మంచినీరు అందించేందుకు నిర్మించారు. ప్రాజెక్టు చుట్టూ ఇసుక నిల్వలు పెరిగి వేసవిలో కూడా నీటి ఎద్దడిని లేకుండా చేయుకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు నిర్మించిన బొడ్డేరు గెడ్డలోనే కరకట్ట నిర్మించారు. ఇదే అదునుగా పంచాయతీలోని కొందరు వ్యక్తులు ఒక సమూహంగా ఏర్పడి ప్రాజెక్టు చుట్టూ ఉన్న ఇసుకను అక్రమంగా తవ్వకాలు చేపట్టి రవాణా చేస్తున్నారు.ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇసుక


జెసిబితో చేపడుతున్న తవ్వకాలు

ర్యాంపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ర్యాంపుల నుండి ఇసుకను నాటు బండ్ల ద్వారా బొడ్డేరు గెడ్డ లోపల నుండి లింగంపేట మెయిన్ రోడ్డుకి దేవాదాయశాఖ భూమిలో నుండి ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక మార్గం ద్వారా స్టాకు పాయింట్‌కి తరలిస్తున్నారు. అక్కడ నుండి మండలంలో పలు గ్రామాలకు ట్రాక్టర్లతో సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ప్రాజెక్టు చుట్టూ ఉన్న ఇసుకను అక్రమంగా తరలించడంతో ప్రోజెక్టు చుట్టూ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో నీరంతా కలుషితమైంది. ఈ సమాచారం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రాజెక్టును సంరక్షించే పనిలో పడ్డారు. దానిలో భాగంగా శుక్రవారం ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలోకి ఇసుక బండ్లు వెళ్లకుండా జేసీబీ సహాయంతో ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ సుదీష్ణ ఆధ్వర్యాన ఇసుక తవ్వకాలు చేపట్టకుండా ట్రెంచులు ఏర్పాలు చేశారు. దీంతో, గ్రామస్థులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.


పరిశీలిస్తున్న ఎఓ

పంటల పరిశీలన

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో చినపాచీల సచివాలయ పరిధి గుమ్మాలపాడు గ్రామంలో పొలాల్లో పెసర, మినిము, అలసంద పంటలను క్షేత్రస్థాయిలో రావికమతం మండల వ్యవసాయ అధికారిని రూప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణం అనుగుణంగా అనేక రకాల తెగుళు పంటలకు వచ్చే అవకాశం ఉందన్నారు. బూడిద తెగులు, మచ్చ పురుగు తెగుళ్ళ ఉన్నట్లు గుర్తించామన్నారు. 30 -35 రోజుల కాల వ్యవధిలో గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ముధుర ఆకులపై బూడిద రూపంలో చిన్న చిన్న మచ్చలుగా ఏర్పడి తదుపరి మిగిలిన ఆకుల పైన కూడా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఆర్.బి.కె ఇంచార్జి మాధురి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగబాబు

మాడుగులలో అభివృద్ధి ఏదీ ?

జనసేన నేత నాగబాబు

ప్రజాశక్తి - మాడుగుల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మాడుగుల నియోజకవర్గంలో అభివృద్ధి లేక పోవడం సిగ్గు చేటు అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు విమర్శించారు. మండలంలోని ఘాటి రోడ్ జంక్షన్‌లో జనసేన పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగబాబు మాట్లాడుతూ, నియోజకవర్గంలో దారుణమైన రహదారులు ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన రిజర్వాయర్ పనులు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గం లో వివిధ సమస్యలపై పార్టీ పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందరపు విజయ్ కుమార్, రాయపరెడ్డి కృష్ణ, మండల అధ్యక్షుడు గట్టిరెడ్డి శివ, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు

సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి -కొత్తకోట:నిబద్ధతతో విధులు నిర్వహిస్తే సమాజంలో అందరి మన్ననలు పొందుతారని, సిఐ తక్కువ సమయం పనిచేసి ఇంత మంది అభిమానం పొందడం అభినందనీయమని డీసీఎంస్ డైరెక్టర్ కొత్తకోట పిఏసిఎస్


సత్కరిస్తున్న నాయకులు

చైర్ పర్సన్ గుమ్మడు సత్యదేవ్, వైసీపీ ప్రధాన కార్య దర్శి తలారి ఆదిమూర్తి అన్నారు. ఇటీవల కొత్తకోట సర్కిల్ నుంచి విశాఖకు బదిలీ పై వెళ్లిన సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్ కు గురువారం రాత్రి కొత్తకోట సర్కిల్ కార్యాలయం ఆవరణలో కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,వ్యవస్థ లో అనేక లోపాలు ఉన్నప్పటి వాటిని సరిదిద్ది విధులు నిర్వహించడం సిఐ మహ్మద్ గొప్పతనంగా వర్ణించారు. ఆయనను ఆదర్శం గా తీసుకొని సహచర ఉద్యోగులు విధులు నిర్వహించాలన్నారు. కొత్తకోట సిఐ అప్పలనాయుడు మాట్లాడుతూ, విధి నిర్వహణ పట్ల అంకిత భావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపిటిసి పూడి దేవ, ఎస్సైలు ధనంజయ్, సురేష్, ఈశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, వైసీపీ యువజన అధ్యక్షులు శీలం కళ్యాణ్ పాల్గొన్నారు..

15వ వార్డులో వైసిపి నేతల పర్యటన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ 15వ వార్డు బ్యాంకు కాలనీలో శుక్రవారం వైసిపి నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, నాయకులు మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పర్యటిస్తున్న నాయకులు

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో ఉత్సాహం

పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్ రెడ్డి


మాట్లాడుతున్న ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-నక్కపల్లి:పిసిసి అధ్యక్షులుగా షర్మిల బాధ్యతలు చేపట్టడంతో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సీనియర్ నాయకులు కొయ్యా ప్రసాద్ రెడ్డి అన్నారు. నక్కపల్లి లో శుక్రవారం సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికలలో స్థానికులకే టికెట్ కేటాయించాలన్న ఆలోచనలో షర్మిల ఉన్నారని అన్నారు.నా అక్కా చెల్లెమ్మలు అంటున్న జగన్ మోహన్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేడేటి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల్ల గోవిందరావు, మారుతి చక్రవర్తి, ప్రగడ చక్రరావు, బి.నాగ చిరంజీవి, బత్తుల రఘు, నీలి అశోక్, బి.శ్రీధర్, రాజశేఖర్, శివ, రెడ్డి ,సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్‌రాక్ సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో ఆన్‌రాక్ అల్యూమినియం ఫ్యాక్టరీను శుక్రవారం తహశీల్దార్ మురళీమోహన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదాల నివారణకు తీసుకున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. అనంతరం ప్యాక్టరీ కార్మికులతో సమావేశమ య్యారు. విధుల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఫ్యాక్టరీ యాజమాన్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్

బిందు సేద్యంపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని మర్రిపాలెం గ్రామ పంచాయతీ సిద్ధిపట్నం గ్రామంలో ఏపిఎంఐపి ఉద్యానశాఖ, పతంజలి కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు బిందు సేద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎంఐపి పిడి జివి.లక్ష్మి బిందు సేద్య పదకం ద్వారా ప్రభుత్వం అందించే రాయితీలు, డ్రిప్ ద్వారా ఎరువులు పంపుటపై వివరించారు. ఆత్మ పిడి ఆశాదేవి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు, నానో ఎరువుల లభ్యత, వాటి ఉపయోగంపై తెలిపారు. పతంజలి కంపెనీ మేనేజర్ చంద్రశేఖర్ పంట యాజమాన్య పద్దతులను వివరించారు. ఈ సదస్సులో కంపెనీ సిబ్బంది, ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశంకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థులు ఎంపిక జరుగుతుందని, అర్హులైన విద్యార్థులు ఈ నెల 23వ తేదీ http.apbrag-gcet.apcfss.inýË ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 5వ తరగతి ప్రవేశానికి 80 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీ 40, బైపిసి 40 సీట్లు ఉన్నాయన్నారు.5వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ వచ్చే నెల 10న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 4:30 నిమిషాలు వరకు జరుగుతుందన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలో ఉన్న బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


పనులు చేయిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి

ప్రజాశక్తి -రావికమతం: పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించామని సర్పంచ్ దాసరి సూర్య కుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు అన్నారు. మండలంలో కవగుంట గ్రామంలో డ్రెయిన్‌లలో పూడిక పోయిన చెత్తాచెదారాన్ని శుక్రవారం తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వీధిలైట్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పిటిసి, సహకారంతో నిధులను తెచ్చి అవసరమైన చోట డ్రెయిన్లను, సిసి రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -రావికమతం: మరుపాక మోడల్ స్కూల్ కి చెందిన 8 మంది విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ లు మంజూరయ్యాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీల్ శుక్రవారం తెలిపారు. ఈ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులు స్కాలర్షిప్ కోసం ప్రవేశ పరీక్ష రాశారు. వీరిలో 8 మంది స్కాలర్షిప్‌కు అర్హత సాధించడం జరిగిందని తెలిపారు. వీరికి 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్షిప్ అందించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

పాక కూల్చివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ:అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలంటూ మండలంలోని పాతకృష్ణదేవిపేటకు చెందిన వృద్ధురాలు నడిగట్ల నూకాలమ్మ శుక్రవారం ఆవేదన వ్యక్తం చేసింది. సుమారు 50ఏళ్లుగా తనకు చెందిన స్థలంలో నివాసం ఉంటుండగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దౌర్జన్యం చేసి తాను ఉంటున్న పాకను కూల్చి వేశారన్నారు. దీనిపై తనకు న్యాయం చేయాలంటూ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు.


మాట్లాడుతున్న వృద్ధురాలు

తహాశీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి -కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయాన్ని రెవెన్యూ డివిజన్ అధికారి జయరాం శుక్రవారం సందర్శించారు. అధికారుల పనితీరుపై ఆరా తీశారు. జగనన్న గృహాల రిజిస్ట్రేషన్, ఓటర్ నమోదు, చేర్పులు, తొలగింపులపై అడిగి తెలుసుకున్నారు. బూత్ లెవెల్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఓటర్లను ప్రభావితం చేస్తున్న వారిని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా శ్రీనిధి మేనేజర్ కరుణానిధి సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు సక్రమంగా అదే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ రికార్డులు సక్రమంగా మెయింటైన్ చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఆసరా పథకం నిధులు సక్రమంగా మహిళలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ రమణకుమారి, ఏపీఎం రమణకుమారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై ర్యాలీ

ప్రజాశక్తి- కోటవురట్ల:రోడ్డు ప్రమాద వారోత్స వాల్లో భాగంగా నివారణకు మండల కేంద్రంలో శుక్రవారం వెలుగు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపిఎం రమణకుమారి, శ్రీనిధి మేనేజర్ కరుణానిధి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రత చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల పాల్గొన్నాయి.

రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి -రావికమతం: గ్రామ పంచాయతీ నిధులతో సి.సి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తట్టబంద ఇందిరమ్మ కాలనీలో ఆరు లక్షల గ్రామ పంచాయతీ నిధులతో 100 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆ ప్రాంత ప్రజలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు.

సబ్సిడీపై గడ్డి కోత యంత్రాలు

ప్రజాశక్తి- చీడికాడ :మండలంలోని వింటిపాలెం గ్రామంలో పశు విజ్ఞాన బడిలో భాగంగా పాడి రైతులకు పశు గ్రాస పెంపకం, ప్రధాన మంత్రి ఉపాధి హామీ కల్పన కింద కిసాన్ క్రెడిట్ కార్డుల రుణాలపై అనగాహన కల్పించారు. సర్పంచ్ పడాల హైమ, ఏంపిటిసి దర్మిశెట్టి స్వాతి సమక్షంలో జెడ్ పిటిసి లాలం శారద చేతుల మీదుగా 40 శాతం సబ్సిడీ పై 3 గడ్డి కత్తిరించే యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు మాట్లాడుతూ, చీడికాడ మండలంలో 27 గడ్డి కత్తిరించే యంత్రాలు పంపిణీ చేశామన్నారు. బైలపూడి, జైతవరం, చీడికాడ, వింటి పాలెం గ్రామాలలో 7 యంత్రాలు పంపిణీ చేశామని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి గాయత్రి దేవి, పడాల అప్పల నాయుడు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై ప్రజా వేదిక

ప్రజాశక్తి-నక్కపల్లి:మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద అధికారులు ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 32 పంచాయతీ గ్రామాల్లో 2022- 23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై జనవరి 19 నుండి ఫిబ్రవరి 8వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహించారు .ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీల్లో వచ్చిన అభియోగాలపై ప్రజా వేదికలో చర్చించారు. రేబాక పంచాయతీ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి నిధులతో ప్రారంభించిన సచివాలయ భవనం పునాది స్థాయిలోనే నిలిచి పోయిందని తెలిపారు.భవన నిర్మాణం పనులను పూర్తి చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, అడిషనల్ పిడి రోజా రమణి డివిఓ నిర్మలాదేవి, అంబుడ్స్ మెన్ చిన్నయ్య దొరడిపిఎం వెంకటనారాయణ పాల్గొన్నారు .

ప్రభుత్వ నిర్బంధంపై..ఆశాల ఆగ్రహం

-విధుల బహిష్కరణ - ఎక్కడికక్కడ నిరసనలు, రాస్తారోకోలు



గాజువాకలో నిరసన చేపడుతున్న ఆశాలు

ప్రజాశక్తి - విలేకర్ల బృంధం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ఎక్కడికక్కడ నిర్బంధించడం, విజయవాడలో అక్రమంగా అరెస్టులు చేయడంపై శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి.

విశాఖ కలెక్టరేట్ : ఆశా వర్కర్స్ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందానికి అనుగుణంగా జిఒ విడుదల చేయాలని, తమపై నిర్భంధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విశాఖలో ఎక్కడికక్కడ నిరసనలు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం విధులు బహిష్కరించారు. వందలాది మంది ఆశా వర్కర్లు జగదాంబ దరి సిఐటియు ఆఫీస్ నుంచి సరస్వతీ పార్కు, దసపల్లా మీదుగా జగదాంబ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంరం అక్కడ ధర్నా నిర్వహించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.పద్మ, వి.మేరి, వై.సీతారత్నం, బి.లీలావతి, విజయ, వై.పద్మ, వరలక్ష్మి, దయానా, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యు.రాజు, టి.నూకరాజు, ఇ.ఆదినారాయణ, జెఎన్.నాయుడు పాల్గొన్నారు.

గాజువాక : ఆశావర్కర్లపై ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూఆశావర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. గాజువాక సిఐటియు కార్యాలయం నుండి గాజువాక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. గాజువాక ఉప తహశీల్దార్ త్రినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి గాజువాక పిహెచ్‌సికి చేరుకుని, వైద్యాధికారికి ప్రాథమిక వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సిఐటియు నాయకులు ఎం జగ్గునాయుడు, ఎం.రాంబాబు, లోకేష్, కోర అప్పలరాజు, పి మణి, కుమారి, హేమలత, సౌందర్య పాల్గొన్నారు.

ఆశాల ర్యాలీ, మానవహారం

తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన తగరపువలసలో శుక్ర వారం ఆశాలుర్యాలీ, మానవహారం నిర్వహించారు. చిట్టివలస యూనియన్ కార్యాలయం నుంచి కార్మికవాడ మీదుగా జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న ఆశాలపై ప్రభుత్వం,పోలీసుల అమానుష, నిరంకుశ చర్యలు శోచనీయమన్నారు. యూనియన్ నాయకులు, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్:సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం నర్సీపట్నంలో ఆశా కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం నుంచి ర్యాలీగా ఎన్టీఆర్ స్టేడియం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, ఆశాలపై నిర్బంధం విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆశా యూనియన్ నాయకులు అరుణ, ఘనలక్ష్మి, రమణి, వరలక్ష్మి, రేవతి, అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:న సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల జిల్లా అధ్యక్షులు కె.చిట్టమ్మ, మండల అధ్యక్షురాలు ఎం.కుమారి, మండల కన్వీనర్ మాతమ్మ, కె.గౌతమి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోలుగుంట:మండల కేంద్రంలో ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, పోలీసులు అరెస్టులు చేసి నిర్బంధించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఇందిరా, లోవ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: ఆశావర్కర్లపై లాఠీచార్జీ చేయడం సరికాదని సిఐటియు మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు తెలిపారు. స్థానిక రామాలయం జంక్షన్‌లో అశావర్కర్లు రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రూప, సత్యవతి, కొండమ్మ, మల్లేశ్వరి, చిన్నమ్మలు పాల్గొన్నారు

కోటవురట్ల:తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు.

అనకాపల్లి

ఆశా కార్యకర్తలను నిర్బంధించి భయభ్రాంతులకు గురి చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ఆశా కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. డ్యూటీలో ఉన్న వారిని, ఇళ్ల వద్ద ఉన్నవారిని రోజంతా పోలీసులతో మానసిక ఒత్తిడికి గురి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తున్న వారిని నిర్బంధించడం, హక్కులను హరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో కార్మికులు సరైన గుణపాఠం తెలుపుతారని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సూర్యకళ, నాయకులు భవాని. నాగమణి, పెద్ద సంఖ్యలో ఆశాలు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో మాట్లాడుతున్న సిఐటియు నేత రాజు

కశింకోట : కసింకోట, తాళ్లపాలెం పిహెచ్‌సిల పరిధిలోని ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు. జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, నాయకులు కె.నూక రత్నం, భార్గవి, రమణమ్మ, ఈశ్వరమ్మ, ఐద్వా జిల్లా నాయకురాలు డిడి.వరలక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి నాలుగురోడ్లు జంక్షన్‌లో ఆశా వర్కర్లు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సిఐటియు మండల నాయకులు బిటి దొర మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వక్కర్లు పార్వతి, కమల, వరలక్ష్మి, రమణమ్మ, చిన్నమ్మలు పాల్గొన్నారు.

రాంబిల్లి : స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆశా కార్యకర్తలు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, ఆశాలు పి.మంగ, రమణమ్మ, నూకరత్నం, కాశీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక మూడు రోడ్ల జంక్షన్లో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా ఎమ్మార్వో కార్యాలయం చేరుకుని తహశీల్దారు ఈశ్వరమ్మకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గట్ట నాగమణి, ఎన్.భాను కుమారి, ఎస్ అరుణ, ఆర్ రామలక్ష్మి, జి దేవుడమ్మ, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి నాయనబాబు, వి సూర్యనారాయణ, ఎర్ర దేవుడు పాల్గొన్నారు.

మునగపాక : ఆశాలపై నిర్బంధాన్ని ఖండిస్తూ ఆశాలు స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి బైపాస్ వరకు ర్యాలీగా చేశారు. మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈ పార్వతి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : తమ సమస్యలను పరిష్కరించాలని బుచ్చయ్యపేట పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ లక్ష్మి, అంబిక లక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం : ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులను నిరసిస్తూ చోడవరంలో ర్యాలీ నిర్వహించి, కొత్తూరు జంక్షన్‌లో మానవహారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు ఎస్‌వి నాయుడు, ఆశా యూనియన్ నాయకులు కే వరలక్ష్మి, బి రామలక్ష్మి, తార, సంతోషి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ చెల్లించే వరకూ పోరాటం

-ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు తేల్చి చెప్పిన నిర్వాసితులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్‌కు సంబంధించి సేకరించిన భూములకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకు పనులు చేపట్టవద్దని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాధరావుకు నిర్వాసితులు తేల్చి చెప్పారు .మండలం లో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ కొరకు సేకరించిన భూములలో బల్క్ డ్రగ్స్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ శుక్రవారం అమరావతి నుండి వర్చ్యువల్‌గా శంఖుస్థాపన చేస్తారని సమాచారం ఉండటంతో చందనాడ రెవెన్యూ భూములలో పరిశ్రమల స్థాపన స్థలం వద్దకు 5 రెవెన్యూ గ్రామాల పరిదిలో భూములు కోల్పోయిన రైతులు, కూలీలు, మత్స్యకారులు, చేతి వృత్తిదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడకు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథరావు రావడంతో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ఈ సందర్భంగా నాయకులు, నిర్వాశితులు మాట్లాడుతూ, సాగు భూములకు, చెట్లకు పూర్తి స్థాయిలో పరిహారం, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి రూ.15 లక్షలు, ఇళ్ళు కోల్పోతున్న వారికి పునరావాసం, 25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని, ప్రతీ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి నిర్వాశితులు సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని జోనల్ మేనేజర్ ను కోరారు.

ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ కాగిత రెవెన్యూ పరిధిలోని ఇళ్లు కోల్పోయిన 795 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పునరావాసం కల్పిస్తామని, సాగు భూములకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు, గ్రామ సభలు, ప్యాకేజీ విషయం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి ప్యాకేజీ, పునరావాసం, ఇతర సమస్యలు తేల్చే వరకూ ఎటువంటి పనులు చేపట్టవద్దని నిర్వాసితులు, నాయకులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు.



జోనల్ మేనేజర్‌తో మాట్లాడుతున్న నాయకులు

ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో ప్యాకేజీ, పరిహారం చెల్లించే వరకు దఫ దఫాలు గా పోరాటాన్ని ఉదృతం చేయాలని నిర్వాసితులు ,నాయకులు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, బుచ్చిరాజుపేట గ్రామ సర్పంచ్ కాళ్ళ శ్రీనివాస్, అమలాపురం గ్రామ సర్పంచ్ పెదపూడి శంకర్రావు, నాయకులు ఆర్.గోవిందరావు, జీ.వెంకటరమణ, ఎస్.అప్పలరాజు, పి.గంగరాజు, పి.సత్తిబాబు, ఎస్.గోవిందరావు, బాబ్జీ, ప్రసాద్,శివ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.